# ఈ అడవిలో

ఈ అరణ్యమార్గంలో
ఇన్ని చెట్లు చుట్టుముట్టగా
మారిపోయాను నేనూ ఒక చెట్టుగా—
దట్టంగా, ఆకుల హార్మ్యంలా.

సూర్యుడు నా తలపై
కాలు పెడుతూ వెళ్ళిపోతాడు
పిట్టలు అరుస్తూ
నాలో నుండి ఎగిరిపోతాయి

నాకో సొంత భాష — కదలిక లేదు
గాలి నిలువునా ఊపుతుంది, విరుస్తుంది
మిగతావాళ్ళలా ఫలాలు — పుష్పాలు —
రుతువుతో మారడం తప్ప,
విరగడంవల్లే నన్ను గుర్తిస్తున్నారు.

ఈ అడవిలో నడుస్తూ — నడుస్తూ
ఆగిపోయినపుడు
చివరికి ఈ అడవి నాలోనే
నడుస్తుందని నే ననుకోలేదు,
చేతులు — చేతులు మాత్రమే
మొలుచుకొస్తాయి నాలో
అలసిన పక్షుల ఆశ్రయం కోసం.

(శ్రీ సర్వేశ్వర్ దయాల్ సక్సేనా హిందీ కవిత ఆధారంగా)

—నిఖిలేశ్వర్

ఆఫీసుకు వెళ్ళే శ్రీవారికి అన్నం వడ్డిస్తూ పిల్లలకు కారియర్‌లో భోజనం సర్దుతున్నాను. ఇంతలోనే స్టీలుసామాన్లు అమ్మేవాడి గొంతు వినబడింది. వాడి గొంతు వినగానే అత్తయ్య ఒడియాలు పెడుతున్నదల్లా లేచి వచ్చి బుట్టలో ఉన్న పాత చొక్కాలు, లాగులు తీసుకొని వరండాలోనికి నడిచి స్టీలుసామానులవాణ్ణి పిలిచారు. గంపలో స్టీలుసామానులు ఎండకు తళతళ మెరుస్తున్నాయి. అత్తగారి కన్ను స్టీలుకారియర్ మీద పడింది.

నాలుగు చొక్కాలు, రెండు పీలు ఇస్తూ "ఆ గిన్నె ఇవ్వబ్బీ" అన్నారు.

"అదేంటమ్మగారూ! అంత పెద్ద ఇస్టీలుగిన్నెకు ఈ చిరిగిన బట్టలా! ఓ పాతపంచా, కోటూ ఉంటే చూడండి. పొద్దున్న బేరం. . ."

అత్తయ్య గబగబా లోనికి వెళ్ళి స్టాండుకు తగిలించి ఉన్న మామగారి గళ్ళకోటు అందుకుని స్టీలుసామాన్లవాడి మొహాన కొట్టి క్యారియరును చూస్తూ మురిసిపోయారు.

నేను అమాంతం ఆశ్చర్యపోతూ "అత్తయ్యా! ఆ కోటు ఇచ్చేశారా! ఎంత పని చేశారు? మామయ్య వస్తే పిస్తైనా ఉందా?" అన్నాను. నా ఆందోళన కొట్టిపారేస్తూ. "ఆఁ. . .! పోనిద్దూ! పాతబడి చిరుగులు పడిపోయిన ముప్పయి ఏళ్ళ కోటు ఎందుకు? దండగ! ఈ కారియర్ చూడు, ముచ్చటగా మూడు గిన్నెలతో సరిక్కా ఉందో! రేపటినుంచి బాబిగాడికి అన్నం దీన్లోనే పెట్టి పంపు" అంటూ సంతోషంతో లోనికి వెళ్ళిపోయారు.

మామయ్య వస్తే ఏం రాద్ధాంతం జరుగుతుందో నన్న భయంతో మెట్లు దిగిపోతున్న స్టీలుసామాన్ల వాడిని కేకేసి నా పాత దిండిగల్ చీరను ఇచ్చి ఆ కోటును వాపసు తీసుకొని అలమారలో దాచాను. ఈ విషయం అత్తయ్యకు తెలియదలే ఉంది.

వా డటు వెళ్ళగానే మామయ్య ప్లీడర్‌గారి దస్తావేజులను మోసుకుంటూ వచ్చారు. గబగబా రెండు మెతుకులు తిని ఆదరాబాదరాగా డ్రెస్ చేసుకోడానికి తన గదిలోనికి వెళ్ళారు.

స్టాండున కోటు లేకపోయేసరికి కంగారుతో "ఏమేవ్! నా కోటేది?"... అని ఇల్లు దద్దరిల్లిపోయేలా అరిచారు.

"అబ్బబ్బ! ఏమిటా గావుకేకలు!... పెంకు ఎగిరేలా? ఏం సంబరం లెండి!. . . ఆ చిల్లికోటును స్టీలు సామానువాడికి పడేసి కారియర్ కొన్నాను." తాపీగా అన్నారు అత్తయ్య. మామగారి మొహం వివర్ణమయింది.

"ఆఁ...! ఏమిటీ! నా కోటును స్టీలుసామానువాడికిచ్చారూ? కొంప ముంచావే! దాన్ని స్టీలుసామాన్లవాడి కివ్వడానికి నీ కెంత ధైర్యం? నీ కెలా చేతులు వచ్చాయే? అసలు ఇవ్వడానికి నీ కేం హక్కుందే? కోటు లేందే నేను కోర్టు కెలా వెళ్ళను?". . .

అత్తయ్య మూతి మూడు వంకర్లు తిప్పుతూ "మీ సంబరం బాగానే ఉంది! పెద వకీలు కుమల్లె ఈయనగారు కోటు లేకుండా కోర్టుకు వెళ్ళరట. ముప్పై సంవత్సరాలనుండి చూస్తున్నా ఈయనగారికి బోడివకీల గుమాస్తాగిరే!"... అంటూ మామయ్యగారిని చులకనగా మాట్లాడుతూంటే నా మనస్సు చివుక్కుమంది. నాకు మామయ్యమీద జాలి, అత్తయ్యమీద కోపంకూడా కలిగింది.

మామయ్య కోపంతో రెచ్చిపోయి "అవ్వ. . .! ఎంత మాటన్నావే! నేను నా ఉద్యోగం అంటే నీ కింత చులకనా?. . . అను, అను అనకేం చేస్తావే?...

జంటిల్‌మన్ వకీలు నీలకంఠంగారి గుమాస్తా అంటే కోర్టులో అందరికీ హడలే! నా సలహాలతో ఎన్ని కేసులు విజయవంతమవలేదు? మొన్న బెండపూడి హత్యకేసులాంటి కేసే గెలిపించలేదా? దాంతో వకీలుగారు నన్ను పొగుడుతూ 'రామారావూ! నీ సలహాతో కేసు గెలిపించావు' అంటూ 600 రూపాయలు నా కిచ్చారు. దాన్ని నీ దోసిట్లో పోశాను గదంటే! దాన్ని కాస్త చంద్రహారం చేయించుకొని మెళ్ళో వేసుకొని వకీలు గారింటికి తిరగలేదంటే! సిగ్గు లేకపోతే సరి.

ఆస్తి అమ్ముకొని నేడు ఇంజనీర్లని, డాక్టర్లని పెద చదువులు చదివిస్తున్నారు కొంతమంది పెద్దలు. తీరా అంత లేసి డాక్టర్లు, ఇంజనీరు ఉద్యోగాలు లేక అలమటిస్తూ ఏ కాఫీహోటలో నడుపుకుంటున్నారని పేపర్లో చదవలేదుటే! దానికంటే నా ఉద్యోగం తీసిపోయిందా? అయినా నేను కోటు లేకుండా కోర్టుకు వెళ్ళను. లా ఒప్పుకోదు" అని బైఠాయించి కూర్చునేసరికి నాకు ఎక్కడలేని నవ్వు వచ్చింది.

అలమారలో దాచిన కోటుని తెచ్చి చేతిలో పెట్టేసరికి మామయ్య మొహం నూరు కాండిల్ బల్బు కాంతిలా వెలిగిపోయింది.

"నా తల్లీ! కోటు దాచి మంచి పని చేశావు. లేకపోతే నా ఉద్యోగానికి సున్నా చుట్టవలసి వచ్చేది" అంటూ సంతోషంతో కోటు తొడుక్కొని చక్కా వెళ్ళారు. వారు వెళ్ళినవైపే చూస్తూ నిట్టూర్చాను. సుఖదుఃఖాలు ఎండమావులలాంటివి. ఎటువంటి పరిస్థితిలోనూ భయపడక వీటికి ఎదురీదేవారే యోగ్యులు. అలాంటి మనస్తత్త్వం కలవారే మామగారు. అసలు మామగారి కోటంటే అందరికీ నవ్వు వస్తుందే గాని దాని వెనక చాలా బృహత్కథ ఉందిలెండి. అది మొదట్లో కొన్నప్పుడు మిలమిలా మెరిసిందేమోగానీ మామగారి జీవిత సమస్యలన్నీ ముడిపడి, కొన్ని చిల్లులు పడి పాత గళ్ళకోటుగా నిలిచింది.

నే నొకమారు "ఈ చిల్లి కోటెందుకు, మామయ్యా? మంచికోటు కొనుక్కుంటే పోలా!" అంటే, "నీకు తెలీదమ్మా దీని కథ" అని నవ్వుతూండేవారు. అదంటే వారికి చాలా ఇష్టం.

కొత్తకోటు కొనుక్కోమంటేనే కాదన్న మామయ్య ఆ కోటు పోయిందన్నప్పుడు—ఇంకేమన్నా ఉందా! నానా గందరగోళం చేసేవారేమో! గుమాస్తాగిరితోనే ఇంత సంసారాన్ని లాగుకు వస్తున్నారంటే అది వారి ఓర్పు, ఔదార్యం అనవచ్చు!

తనకున్న దాంట్లోనే ఇతరులకు సహాయపడే తత్త్వం. లా చదవకపోయినా వకీలుగారికి చక్కని సలహాలిచ్చి కేసులను గెలిపింపచేసేవారు. దాంతో మామయ్య మంచి పలుకుబడి సంపాదించుకున్నారు. మామయ్యది వెన్నలాంటి మనసు. ఎటొచ్చీ అత్తయ్య గడుసుదనం మామయ్యని కొంచెం బాధ పెట్టేది.

కాలప్రభావం మనిషిమీద చెప్పలేని ముద్ర వేస్తుంది. కాలంకొద్దీ మనమూ మారుతున్నాము. నాటి ఆచారాలు, సంప్రదాయాలు మట్టిలో కలిసి నేటి నాగరికతాచిహ్నంగా క్లబ్బుల్లో వెలిశాయి. నాటికీ, నేటికీ ఎంత తేడా?

ఆ కాలం తెల్లవారల రాజ్యమయినా వస్తువుల ధరలు చౌకగా ఉండి ప్రజానీకానికి అనుకూలంగా అందుబాటులో ఉండేవి. అప్పుడు ఒక రూపాయికి 11 శేర్ల బియ్యమట! ఎటొచ్చీ స్వాతంత్ర్యం లేదని బాధపడేవారుగానీ బాపూజీ సత్యాగ్రహంతో శృంఖలాలతో బంధింపబడిన దేశం కాస్త స్వతంత్రరాజ్య మయింది. సామరస్యంతో నాయకులు చూపిన మార్గంలో నడవక విద్రోహాచర్యలు, భాషాభేదాలు, రాష్ట్ర విభేదాలతో దేశంలో అలజడిని కొంతమంది విద్రోహులు రేపుతున్నారు. మనలో మనమే ఇలా కొట్టుకుచస్తూంటే పొరుగువాడు మాత్ర మూరుకుంటాడా? నేటి ప్రజారాజ్యానికి పట్టిన దుస్థితి ఇది.

**దేశాలకీ, మనుషులకూ చరిత్ర ఉన్నట్టే కొన్ని వస్తువులకూ చరిత్ర లుంటాయి అవి పురావస్తు పరిశోధకుల పాలిట పసవుగానీ, వాటితో అనుబంధం కలవారికి వాటి విలువ చాలా ఎక్కువ. ఆ వస్తువును చూస్తే చాలు కాల గర్భంలో కలిసిపోయిన అనేక సంఘటనలు మనసులో మెదులుతాయి. ఆ వస్తువు విలువ దానికి సంబంధించిన సంఘటననుబట్టి ఉంటుంది గానీ, దాని ఖరీదునుబట్టి కాదు.**




— కె. లక్ష్మి

నేడు పంచవర్ష ప్రణాళిక లేర్పడినా, జనాభా తగ్గినా ఆహార సమస్య జటిల సమస్యగా నిలిచిపోయింది. విద్యావిజ్ఞానం అధిగమించినా వివేకం మాత్రం శూన్యం అయింది.

ఇక ఆడపిల్లలపెళ్లి విషయం వేరే చెప్పనవసరం లేదు. అంతవేసి కట్నాలు ఇచ్చుకోలేక ఆడపిల్లలను ఎమ్. ఎ., బి. ఎ. ల దాకా చదివిస్తున్నారు కొంతమంది తల్లిదండ్రులు. తమ పిల్లల చదువులకంటే పై డిగ్రీల వాణ్ణి తేవాలని కోరుకుంటారు. అందరూ అందల మెక్కితే మోసేవా రెవరన్నట్లు! దాంతో కట్నాలు అధిగమిస్తాయి. "ఆ. . . పెళ్లికి ఇప్పుడే ఏం అవసరం" అంటూ ఉద్యోగాల్లో దింపుతున్నారు కొంత మంది. చివరికి ఆమె సంపాదనమీద ఆధారపడుతూ కన్నపిల్లకు ఆశలు, ఆశయాలు ఉన్నాయన్న మాటే మరిచిపోతారు.

ఇంక అమ్మాయికూడా పెళ్లి కానందుకు ఓ వంక మథనపడుతూ కుటుంబానికి ఓ విధంగా సాయపడు తున్నాననే తృప్తివల్ల గుడ్డిగా రోజులు వెళ్ళబుచ్చు టంతో ఆమె కన్నెవయస్సు ముదిరి ప్రౌఢగా మారు తుంది.

తమ స్తోమతకు తగిన వరుని తెచ్చుకుంటే ఏ చీకూచింతా ఉండదు. కాని ప్రతి ఒక్కరు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలంటే వారి డిమాండ్లు పెరిగిపోయి కట్నాలు ఆకాశాన్నంటుతాయి. ఈ కట్నాల సమస్య తీరాలంటే ప్రభుత్వం గట్టిచర్య తీసుకోవాలి.

ఇదంతా దేనికి రాస్తున్నానంటే మామయ్య చిన్నతనంలో కట్నాలకన్నా కన్యాశుల్కాలు మెండుగా ఉండేవట. పెళ్లిచూపుల మాట అసలే లేవు. పెద్దలు నిర్ణయించిన పెళ్లే చేసుకొనేవారు. ఆ కాలంలో బాల్యవివాహాలు అమలులో ఉండేవి. పిల్లకు 8 ఏళ్ళు, అబ్బాయికి 16 ఏళ్లుఉంటే చాలు పెళ్లి చేసేవారు.

మామయ్యకు 16 ఏళ్లు ఉన్నప్పుడే కన్యాన్వేషణకు బయలుదేరారట! చింతలపల్లి అని ఓ మూలకుగ్రామంలో కరణం పరంధామయ్యగారి కుమార్తె వెంకటలక్ష్మితో వివాహం నిశ్చయమైంది.

ఈ కాలంలో కట్నమే ప్రధానమనుకుని ఒక్క రోజులో పెళ్లి అయిందనిపిస్తారు. కాని ఆ కాలంలో

అలా కాదు. వారం రోజులు విజృంభణంగా వియ్యాల వారు సరిసమానంగా వంతులు వేసుకుంటూ పెళ్లిళ్ళు చేసేవారు.

సుబ్బారావుగారు కన్యాశుల్కం 600 రూపాయలు చెల్లించి కాసులపేర్లు, ఉంగరాలు, కంఠసరాలు, పట్టు చీరలు పెడతామన్నారట! ఆ కాలంలో 600 రూపాయలే ఆరువేల క్రింద లెక్కింపబడేది. ఈ కాలంలో అందరికి సరిసమానంగా జీతాలు వచ్చినా డబ్బుకి విలువేదమ్మా అంటారు మామగారు.

ఆ కాలంలో ఎడ్లబండ్లమీదనే ఎంత దూరమయినా ప్రయాణాలు సాగించేవారు. పెళ్లి రెండు నెలలు ఉందనగానే చుట్టాలతో ఇల్లు కిటకిట లాడిపోయేదిట. రోజూ నాలుగు కుంచాల బియ్యం వండి వార్చేవారని మా బామ్మ చెబుతూండేది.

మామగారి దూరపుబంధువులు, ఆయన మేనత్తగారి మునిమనుమడు, మామగారి పినతల్లి వేలువిడిచిన మామగారి కొడుకు. . . ఎక్కడలేని బంధువులు వచ్చి చేరారు. ఆ కాలంలో కుటుంబాలు ఉమ్మడిగా ఉండేవి. ఆడవాళ్ళ పెత్తనం చెలాయించేవారు కారట.

ఓ శుభముహూర్తాన పెళ్లివారు పది ఎద్దుబళ్లలో చింతలపల్లికి ప్రయాణం సాగించారు. మినపసున్ని ఉండలు తింటూ పెళ్లిపదాలు పాడుకుంటున్న ముత్తయిదువులు, చుట్టలు కాల్చుకుంటూ పెళ్లి ముచ్చట్లు చెప్పుకుంటున్న మగవాళ్లు, పిల్లల గోలతో, చిరుగంటల శబ్దాలతో అక్కడక్కడ మజిలీలు చేసుకొంటూ సూర్యాస్తమయం అయ్యేసరికి ఓ గ్రామం చేరారు.

ఆ గ్రామంలో, ఒక సత్రంలో బస చేశారు. ఆడంగులు వంట ప్రారంభించారు. చిన్నపిల్లలు ఏడ్చి ఏడ్చి అలిసి నిద్ర పోయారు. అంతా భోజనాలు చేసేసరికి రాత్రి 12 అయింది. ఎక్కడవారక్కడ ప్రయాణ బడలికతో నిద్రపోయారు.

ఆ నిశీథ సమయంలో కుక్కల అరుపులు ఒక్కసారిగా వినబడ్డాయి. దొంగలు పడి సుబ్బారావుగారి మేనత్త నగలు నట్రా అంతా దోచుకుపోయారు. పెళ్లివారికి విచారం కలిగింది. ఈ దెబ్బతో పెళ్లివారికి చాలా ఆలస్యం అయింది.

ఆ కాలంలో కరణం రెడ్లంటే గ్రామాల్లో బాగా పలుకుబడి ఉండేది. కరణం పరంధామయ్యగారింట్లో పెళ్లంటే మాటలా? పెళ్లివారింట్లో హడావిడి అంతా ఇంతా కాదు. పట్టుచీరల రెపరెపలు, గాజుల గలగలలు, పిల్లల నవ్వులతో పెళ్లిపందిరి సందడిగా ఉంది.

వియ్యాలవారి కోసం ఎదురుచూసి విసిగిపోయిన వారి గుసగుసలు బయలుదేరాయి. కోపంతో చిందులు తొక్కారు పరంధామయ్యగారు. మగపెళ్లివారు రాలేదన్న కోపం ఆడపెళ్లివారిలో కొట్టొచ్చేలా కనబడుతూంది.

"అయినా సుబ్బారావు అనుకున్న ప్రకారం ముహూర్తం వేళకు రాలేకపోయాడు" అంటున్నాడు ఓ వృద్ధుడు.

"ఎక్కడి రాయలసీమ. . . ఎక్కడి చింతలపల్లి? ఆ కోస్తానుంచి రావాలంటే మాటలా? అందులోను ఎడ్లబండిమీది ప్రయాణమాయె. సుబ్బారావు మాట తప్పేవాడు కాదు" అంది ఒక ముసలమ్మ.

"మన మెంత అనుకున్నా ఏం ప్రయోజనం? ముహూర్తం కాస్త దాటిపోతుందాయె. నా పరువు ప్రతిష్ఠలు నట్టేట్లో మునగకముందే సుందరంగారి అబ్బాయికి మన అమ్మాయి నిచ్చి ముడి వేస్తే సరి. వారు చేసిన మోసానికి పై ఎత్తు ఇదే. ఒరే, సోమయ్యా! సుందరంగారిని ఉన్నపళాన రమ్మని చెప్పు!" గర్జించారు పరంధామయ్యగారు.

"అవేం మాటలండీ? మాట ఒకరికి, మనువు వేరొకరితోనా? అవ్వ. . .! పదిమందీ చూసి నవ్వరూ! సుబ్బారావన్నయ్య అలాంటి వాడు కాదు. పాపం. . .! వారి కేం కష్టం వచ్చిందో ఏమో?" కళ్లద్దుకుంది పెళ్లికూతురి తల్లి.

"నోర్మూయ్! ఆ పెద్దమనిషి రాకపోతే ఏం మునిగిపోలేదు. ఇంత ఖర్చుచేసి నలుగుర్లో నవ్వులపాలు కాకముందే సుందరంగారి అబ్బాయి కిచ్చి మూడు ముళ్లు వేయిస్తాను. . ." అంటూ మీసాలు దువ్వారు పరంధామయ్యగారు.

తక్షణమే సుందరంగారి అబ్బాయి గోపాలానికి లక్ష్మినిచ్చి ఆ ముహూర్తానికే వివాహం జరిపించి "శభాష్" అనిపించుకున్నారు. అతని ధైర్యానికి గ్రామస్థులంతా ముక్కుమీద వేళ్లేసుకున్నారు. అనుకున్న దొకటి అయ్యే దొకటి. భవిష్యత్తు [illegible] దేవతలమైపోము!

ఇక్కడ సుబ్బారావుగారు నానా [illegible] పడుతూ, క్రమంగా బండిశబ్దాలతో [illegible] పొలిమేరల్లో అడుగు పెట్టారు. బాజాభజంత్రీలతో తీసుకువెడతారని చుట్టూ కలియచూసి, "ఇదేమిటి, ఎవ్వరూ లేరే!" అని ఆశ్చర్యపోతున్న సమయంలో గోచి ఎగదోసుకొంటూ ఆ ఊరి రెడ్డిగారు పరుగు పరుగున ఎదురు వచ్చారు.

"హి. హి. హి. . .! వచ్చారా! ఇంతాలస్యమయిందేమండీ!" కంటిఅద్దాలు సవరిస్తూ అడిగాడు.

"దొంగలు పడి మా చుట్టాల నగలన్నీ ఎత్తుకుపోయారు! మా అవస్థ ఏమని చెప్పమంటారు? ఏడీ! వియ్యంకుడు చడి లేడేం? పెళ్లివారికి చూపవలసిన మర్యాద ఇదేనా" అని అడిగారు.

రెడ్డి మాట్లాడకుండా బళ్లను సత్రం దగ్గిరకు తోలించారు.

సుబ్బారావు అనుమానంతో "అయినా వియ్యంకుడి ఇల్లు ఉండగా సత్రంలో దింపటమేమిటండీ" అని మొహం చిట్లిస్తూ, వియ్యంకుడి హోదా చూపిస్తూ అన్నారు.

'నీ మర్యాద మండిపోనూ!' అని మనసులో అనుకొని పైకి నవ్వుతూ "మీ రంతా భోజనాలు కానీయండి. పిల్లలంతా ఆకలితో ఏడుస్తున్నారాయె! లేవండి. లేవండి. . . భోజనాలు చేయండి. నేను సావధానంగా చెబుతాగా!" అన్నాడు రెడ్డి.

పెళ్లికొడుకు తల్లీ తండ్రీ తప్ప మిగిలినవారంతా ఆవురావురుమని భోజనం చేశారు.

అరుగుమీద కూర్చుని తాంబూలం వేసుకుంటూ సుబ్బారావు ఉండబట్టలేక "ఏమిటీ చడీ చప్పుడూ లేదు? మమ్మల్ని చంపక అసలు విషయం చెప్పండి" అన్నారు.


"చెప్పేందు కేముందండీ! సింగినాదం... జీలకర్ర. మీరు ఆలస్యం చేసినందుకు ఆ ముహూర్తం కాస్త దాటిపోతుందని పరంధామయ్యగారు వేరే సంబంధం చూసుకుని ఆ ముహూర్తానికే పెళ్లి చేశారండీ! అయినా ఆ అమ్మాయికి మీ కోడలయ్యే అదృష్టం లేదు" అని చావుకబురు చల్లగా చెప్పాడు.

ఒక్కసారిగా అందరూ నిర్ఘాంతపోయారు. వియ్యంకుడు నోరు తెరిచి "ఆఁ. . ." అంటూ ఉద్వేగాన్ని ఆపుకోలేక, "ఎంత ధైర్యం. . .! ఆలస్యం అయినంత మాత్రాన వేరే సంబంధం ఎలా చేశాడా పెద్దమనిషి? అతనిమీద పరువునష్టందావా వెయ్యకపోతే నా పేరు సుబ్బారావే కాదు. . . మించిపోయిందేముంది? వీడు కాకపోతే వీడి తాతలాంటి సంబంధం తెస్తాను నా కొడుక్కి" అంటూ కోపంతో చిందులు తొక్కాడు.

"శాంతించండి, సుబ్బారావుగారూ! అయిన పెళ్లికి మేళమేమిటి? కాస్త యోచించండి. మీ అబ్బాయికి ఎలాగైనా పెళ్లి అవుతుంది. ఆడపిల్ల విషయం చూడండి. ఇంత ఖర్చు పెట్టి నలుగుర్లో అప్రతిష్ఠపాలు కాకుండా వేరే సంబంధం చూసుకున్నారు. మీరే ఆలోచించండి" అన్నాడు తాంబూలం నములుతూ రెడ్డి.

కొండా కోనా

చిత్రం—పి. జయశ్రీ (సికింద్రాబాదు-౩)



"ఇంకా ఆలోచించడమేమిటయ్యా? పిల్ల నిస్తానని ఇంత అవమానం చేస్తాడా?"

బండి తోలే వీరయ్యమీద, ప్రయాణానికి ముహూర్తం నిర్ణయించిన సిద్ధాంతిమీద విరుచుకు పడ్డారు.

"వాళ్ళేం చేస్తారండీ? మన ఖర్మ ఇలా తగలడి ఉంటే" అంది సుబ్బారావు భార్య.

"సుబ్బారావుగారూ! మీరు వింటానంటే నే నో చక్కని సలహా చెప్తాను. . ."

"చాల్లేవయ్యా! నీ సలహా నువ్వూనూ. . . ఇప్పటికే బిక్కచచ్చిఉంటే. . ."

"అది కాదండీ! మీరు వినుక్కుంటే ఎలాగ?. . . ఎలాగూ ఇంతదూరం వచ్చారు. ఉత్త చేతులతో పోవడం నా కేం ఇష్టం లేదు. పక్కగ్రామం లక్ష్మీపాలెంలో ఓ సంబంధం ఉంది. వారు మంచి ఆస్తిపరులు. . . ఆయన పేరు ఏదో ఉందండీ. . .!" అని బుర్ర గోక్కున్నాడు. ఆ పైన "చెబుతా వాగండి. . . . . . ఏదో జ్ఞాపకం రావడం లేదు. . . ఆఁ. . . ఆఁ. . . ఆయన పేరు రామావధానులు. . . ఆయన్ని అడిగారంటే బిడ్డనిచ్చి కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తాడు. . . అదో. . . చూశారా. . . గంటకూడా కొట్టింది. నా మాట నిజం. . . వస్తా. శుభం" అంటూ తన దోవన తాను వెళ్లిపోయాడు రెడ్డి.

అతని మాటలతో ముడుచుకున్న మొహాలలో కళలు విచ్చుకున్నాయి. భూతకాలంలో జరిగిన విషయానికి నిట్టూరుస్తూ, భవిష్యత్కాలంలో జరిగే విషయానికి ఆశలు నింపుకుంటూ ఉమారుమవి బళ్ళు కట్టించి తెల్లారేసరికి-లక్ష్మీపాలెం చేరుకుని సత్రంలో విడిదిచేశారు.

పెద్దమనుష్యులతో కలిసి అసలు విషయం బయట పెట్టి "మీ అమ్మాయినిచ్చి మా పరువు కాపాడాలండీ!" అంటూ ఆయన చేతులు పట్టుకుని సుబ్బారావుగారు ప్రాధేయపడ్డారు.

పిల్లకు పెట్టే నగలు కన్యాశుల్కం ముందుంచారు రామావధాన్లుగారు. 'ఏం చేద్దాం' అన్నట్టు భార్య మొహంలోకి చూశారు.

కాసులపేర్లు, వంకీ వడ్డాణం, అడ్డబాసలు, కెంపుల చంద్రహారము, మురుగులు చూసిన ఆమె కళ్ళు జిగేల్మన్నాయి.

"కక్కు వచ్చినా, కళ్యాణం వచ్చినా ఆగదు కదా! మన పిల్ల అదృష్టవంతురాలు! పాపం, ఆ పెద్దమనిషి కోరి కన్యాదానం చేయమంటున్నారు ... తప్పుతుందా మరి. . .! శుభస్య శీఘ్రం. కానీయండి మరి."

దాంతో అందరి మొహాలు విరిశాయి. మరునటి రోజు పెళ్లిపందిట్లో ఆహూతుల సమక్షాన ఘనంగా పెళ్లి జరిగింది.

అందరి ఆశీస్సులు, అక్షింతలు మూతన వధూవరుల పైనపడ్డాయి. వియ్యంకులు అల్లునికి ఒక చక్కని గళ్ళకోటును బహూకరించారు.

ఆ నాటి పెళ్లికోటే ఈ నాటి చిల్లి గళ్ళకోటు.

ఇంతకు వధూవరులు ఎవరనుకున్నారు?. . . మా మామయ్య రామారావుగారు, మా అత్తయ్య పావిత్రమ్మగారు. . .

మళ్లీ ఇంకోసారి కలుద్దాము. . .

సెలవా, మరి. . .

★



[illegible]

చిత్రం—మేథే